క్లుప్తంగా

ఎంపీడీఓ పరిశీలన



అలజంగి సచివాలయంలో కంప్యూటర్‌లో పొందుపరిచిన సమాచారాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ అల్లు భాస్కరరావు

బొబ్బిలి రూరల్: మండలంలోని అలజంగి గ్రామ సచివాలయం, ఉన్నత పాఠశాల, చెత్త సంపద కేంద్రాలను ఎంపీడీఓ అల్లు భాస్కరరావు శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బంది హాజరు, పనితీరు, సచివాలయ నిర్వహణపై ఆరా తీశారు. అలాగే కంప్యూటర్‌లో పొందుపరిచిన సమాచారాన్ని పరిశీలించి సిబ్బంది పలు సూచనలు చేశారు. అనంతరం చెత్త సంపద కేంద్రం, జెడ్పీ ఉన్నత పాఠశాలను పరిశీలించారు.

పోలింగ్ కేంద్రం తనిఖీ



పోలింగ్ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న తహసీల్దార్ రాజేశ్వరరావు

తెర్లాం: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎన్నికలకు సంబంధించి మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని తహసీల్దార్ డోల రాజేశ్వరరావు శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని పంచాయతీ కార్యదర్శి, ఈఓలకు సూచించారు. పోలింగ్ కేంద్రంలో ఏర్పాట్లను పూర్తి చేయాలని హెచ్‌ఎం పాపారావుకు తెలిపారు. ఆయనతో పాటు మండల ఈఓపీఆర్‌డీ రాంబాబు, ఏఎస్సై మల్లేశ్వరరావు, వీఆర్‌ఓలు శ్రీనివాసరావు, గోపాల్, తదితరులు ఉన్నారు.

డబ్బు, మద్యం రవాణాకు చెక్

• సీఐ తిరుమలరావు



పోలీస్ చెక్‌పోస్ట్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్న సీఐ తిరుమలరావు

రామభద్రపురం: ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో డబ్బు, మద్యం రవాణా కాకుండా తగిన ఏర్పాట్లు చేసినట్లు సీఐ తిరుమలరావు అన్నారు. మండల కేంద్రంలోని బైపాస్ జంక్షన్‌లో ఏర్పాటు చేసిన పోలీస్ చెక్‌పోస్టు వద్ద శుక్రవారం వాహన తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అక్రమాలు జరగకుండా ముమ్మరంగా వాహన తనిఖీలు చేపడుతున్నట్లు చెప్పారు.

నవధాన్యాల సాగుతో మేలు



గొల్లాదిలో అవగాహన ర్యాలీ

బాడంగి: నవధాన్యాల సాగుతో భూములను సారవంతం చేసుకోవచ్చని ప్రకృతి వ్యవసాయం మాస్టర్ ట్రైనీ శ్రీనివాస్ అన్నారు. మండలంలోని గొల్లాదిలో నవధాన్యాల సాగుపై శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించి, సేంద్రియ ఎరువులు వాడాలని సూచించారు. కార్యక్రమంలో వీఏఏ సతీష్, యూనిట్ ఇన్‌చార్జ్ ఈశ్వరరావు, ఆర్.రమణ, సన్యాసినాయుడు, అప్పలనాయుడు, ఐసీఆర్‌పీ చైతన్య, రైతులు పాల్గొన్నారు.

పోలింగ్ సామగ్రి రాక



బ్యాలెట్ బాక్సులను పరిశీలిస్తున్న అధికారులు

బొబ్బిలి రూరల్: ఈ నెల 13న జరగనున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించిన సామగ్రి స్థానిక తహసీల్దార్ కార్యాలయానికి చేరుకుంది. డివిజన్ పరిధిలోని బొబ్బిలి, గజపతినగరం నియోజకవర్గాలకు సంబంధించి 40 పెద్ద బ్యాలెట్ బాక్సులు, 20 చిన్న బ్యాలెట్ బాక్సులతో పాటు డిస్ట్రిబ్యూషన్ సిబ్బందికి అందించాల్సిన సామగ్రి వచ్చింది. వీటిని తహసీల్దార్ ఎస్. రాజారావు, ఆర్‌ఐ కల్యాణ చక్రవర్తి పరిశీలించారు.

త్వరగా పూర్తి చేయాలి

మెంటాడ: ఈ నెల 22న సామూహిక గృహప్రవేశాలు చేయనున్న నేపథ్యంలో నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలని ఎంపీడీఓ త్రివిక్రమ్ అన్నారు. మండలంలోని కేఎల్‌వలస పంచాయతీ పరిధిలోని జగనన్న కాలనీని శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు, హౌసింగ్ సిబ్బందికి పలు సూచలను చేశారు.

• సీతంరాజుకు అండగా...

ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ బరిలో వైఎస్సార్‌సీపీ తరపున పోటీ చేస్తున్న సీతంరాజు సుధాకర్‌కు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు అండగా నిలిచారు. ఈ నెల 13న ఎన్నిక జరగనున్న నేపథ్యంలో ప్రచారాన్ని హోరెత్తించారు. ఎమ్మెల్యేల నుంచి మండల స్థాయి నాయకులు, కార్యకర్తల వరకు ప్రతి ఒక్కరూ శుక్రవారం ప్రచారం చేపట్టారు. పట్టభద్రుల ఇళ్లకు వెళ్లి సీతంరాజును గెలిపించడం వల్ల ఉత్తరాంధ్రకు కలగనున్న మేలును వివరించారు. ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి చేపట్టిన అభివృద్ధి, సంక్షేమం చూసి సీతంరాజుకు మొదటి ప్రాధాన్యం ఓటు వేయాలని కోరారు. ఓటర్ల నుంచి కూడా సానుకూల స్పందన రావడంతో నాయకులు గెలుపుపై ధీమా వ్యక్తం చేస్తున్నారు.

– బొబ్బిలి/రాజాం నెట్‌వర్క్



బొబ్బిలి: నమూనా పత్రాన్ని ఓటర్లకు అందజేస్తున్న ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు, తదితరులు



రామభద్రపురం: నరసాపురంలో ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



రేగిడి: సంకిలి సుగర్ ఫ్యాక్టరీలో ఎమ్మెల్సీ విక్రాంత్, ఎమ్మెల్యే జోగులు



వంగర: ఇంటింటికీ వెళ్లి, ప్రచారం చేస్తున్న ఎంపీపీ సురేష్‌ముఖర్జీ తదితరులు



బొబ్బిలి రూరల్: రంగరాయపురంలో ప్రచారం చేస్తున్న ఎంపీపీ శంబంగి లక్ష్మి, జెడ్పీటీసీ సభ్యురాలు శాంతికుమారి



బొబ్బిలి రూరల్: శివడవలసలో ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకురాలు పిల్లా వసుంధర, తదితరులు



మెంటాడ: సీతంరాజుకు ఓటువేయాలని ప్రచారం చేస్తున్న ఎంపీపీ రెడ్డి సన్యాసినాయుడు, తదితరులు



రాజాం: లచ్చయ్యపేటలో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే కంబాల జోగులు

సత్కారం



లక్ష్మణరావు, రమాదేవిలను దుశ్శాలువతో సత్కరిస్తున్న ఎమ్మెల్యే కంబాల జోగులు తదితరులు

రాజాం సిటీ: రాజాం పట్టణ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు, రైస్ మిల్లర్ల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పొట్నూరు లక్ష్మణరావు, రమాదేవి దంపతుల 25వ పెళ్లిరోజు వేడుకలు కుటుంబ సభ్యులు, అభిమానులు నడుమ శుక్రవారం ఘనంగా జరిగాయి. దంపతులిద్దరినీ ఎమ్మెల్యే కంబాల జోగులుతోపాటు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పట్టణ నాయకుడు లక్ష్మణరావు ఆశీర్వదించారు. దంపతులిద్దరినీ దుశ్శాలువ, పుష్పగుచ్ఛాలతో సత్కరించారు. అంతకు ముందు లక్ష్మణరావు దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించి మహిళలకు కానుకలు అందజేశారు. వైఎస్సార్ సీపీ నాయకులు సలాది తులసీదాస్, దూబ గోపాలం, కెంబూరు నారాయణరావు, అద్దంకి దిలీప్‌కుమార్, ఎ.వేణుగోపాల్, ఒ.గణపతి, రాజు తదితరులు అభినందనలు తెలిపారు.

బాల్య వివాహాలపై అవగాహన



సమావేశంలో మాట్లాడుతున్న పంచాయతీ కార్యదర్శి ఎంప స్వామి

తెర్లాం: సఖీ గ్రూపుల్లో గల కిశోర బాలికలకు బాల్య వివాహాలపై అంగన్‌వాడీ కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లు అవగాహన కల్పించాలని కూనాయవలస పంచాయతీ కార్యదర్శి ఎంప స్వామి అన్నారు. ఎంపీడీఓ శంబంగి రామకృష్ణ ఆదేశాల మేరకు స్థానిక గ్రామ సచివాలయంలో సఖీ, సహేలీ గ్రూపులకు సంబంధించి గ్రామస్థాయి సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కిశోరి బాలికలందరినీ సఖీ గ్రూపుల్లో సభ్యులుగా చేర్పించాలని తెలిపారు. బాల్య వివాహాలు, గుడ్/బ్యాడ్ టచ్, దిశ, పోక్సో చట్టాలపై అవగాహన కల్పించాలని చెప్పారు. 18 ఏళ్లలోపు వివాహాలు చట్టరీత్యా నేరమన్నారు. సమావేశంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఏఎన్‌ఎం, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

విధి నిర్వహణలో అలసత్వం తగదు

• ఇన్‌చార్జ్ ఆర్డీఓ పద్మలత



డిస్ట్రిబ్యూషన్ సిబ్బందికి సూచనలిస్తున్న ఇన్‌చార్జ్ ఆర్డీఓ పద్మలత

బొబ్బిలి రూరల్: ఈ నెల 13న జరగనున్న ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, విధి నిర్వహణలో అలసత్వం తగదని చీపురుపల్లి ఎస్డీసీ, బొబ్బిలి ఇన్‌చార్జ్ ఆర్డీఓ కె.పద్మలత ఎన్నికల సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో డిస్ట్రిబ్యూషన్ సిబ్బంది, ఇతర సిబ్బందికి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సమావేశానికి పలువురు ఆలస్యంగా రావడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం డిస్ట్రిబ్యూషన్ మెటీరియల్ ఏ విధంగా కౌంటర్లలో సిబ్బందికి అందించాలో వివరించారు. ఆమె వెంట తహసీల్దార్ ఎస్.రాజారావు, ఎన్నికల డీటీ ఈశ్వరమ్మ, తదితరులున్నారు.

షాపులను వినియోగించుకోండి

బొబ్బిలి: పట్టణంలోని ఆర్టీసీ కాంప్లెక్స్‌లో గల దుకాణాలను వ్యాపారులు వినియోగించుకోవాలని ఆర్టీసీ జిల్లా ప్రజా రవాణాధికారి కె. శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్‌లో గల దుకాణాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఐదేళ్ల కాల పరిమితికి అద్దె ప్రాతిపదికన వినియోగించుకునేందుకు ఔత్సాహికులకు అవకాశం కల్పిస్తున్నామన్నారు. బొబ్బిలిలో 22 షాపులు, ఖాళీ స్థలాలకు, రామభద్రపురంలోని ఆర్టీసీ కాంప్లెక్స్‌లో ఒక షాపునకు టెండర్లను ఆహ్వానిస్తున్నామన్నారు. ఔత్సాహికులు తమ టెండర్లను ఈనెల 14వ తేదీ మధ్యాహ్నం 2 గంటల లోగా జిల్లా ప్రజారవాణాధికారి కార్యాలయంలో గల టెండరు బాక్సులో వేయాలన్నారు. అదే రోజు సాయంత్రం 3 గంటలకు టెండర్లు తెరుస్తామని తెలిపారు. ఆయన వెంట డిపో మేనేజర్ జె. శ్రీనివాసరావు తదితరులున్నారు.

సీతంరాజుకు ఐఎంఏ మద్దతు



బొబ్బిలిలో ఐఎంఏ ప్రతినిధులతో ఎమ్మెల్యే శంబంగి

బొబ్బిలి: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌కు ఇండియన్ మెడికల్ అసోసియేషన్ బొబ్బిలి యూనిట్ మద్దతు తెలిపింది. శుక్రవారం సాయంత్రం పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో వైద్యులతో ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐఎంఏ పూర్వ కార్యదర్శి గొట్టాపు బలరాంనాయుడు మాట్లాడుతూ, సీతంరాజు సుధాకర్‌ను గెలిపించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో గుల్ల రామ్ నరేష్, డాక్టర్ బొత్స కాశినాయుడు, డాక్టర్ జి. శశిభూషణ రావు, బోటు గౌరీశంకర్, పి సునీల్, సునీత, నాన్ మెడికల్ సిబ్బంది పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌పై అవగాహన కల్పించాలి



న్యాయవాదుల సమావేశంలో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి బాబు

రాజాం సిటీ: లోక్ అదాలత్‌లో కేసులు పరిష్కరించుకునేలా కక్షిదారులకు అవగాహన కల్పించాలని సీనియర్ సివిల్ జడ్జి ఎం.బాబు అన్నారు. శుక్రవారం స్థానిక కోర్టు సముదాయంలో జరిగిన న్యాయవాదుల సమావేశంలో పాల్గొన్న ఆయన ఈ నెల 13వ తేదీన ప్రత్యేక లోక్‌అదాలత్ నిర్వహించనున్నామని, ఇందులో రాజీకి అనుకూలమైన మనోవర్తి కేసులు, గృహహింస కేసులు, భార్యాభర్తల కేసులు ఇరుపార్టీల అంగీకారంతో పరిష్కరించుకోవచ్చన్నారు. ఈ అవకాశాన్ని కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ రాజాం అధ్యక్షుడు కంచరాన రమణమూర్తి, ఏజీపీ ఎస్.పోలారావు పాల్గొన్నారు.

సావిత్రిబాయి పూలే ధీర వనిత

• ఏఎంసీ వైస్ చైర్మన్ తెంటు పార్వతి
• వాడవాడలా వర్ధంతి కార్యక్రమాలు



బొబ్బిలి: సావిత్రిబాయి పూలే విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న తెంటు పార్వతి, తదితరులు

బొబ్బిలి: అనాగరికత ప్రభావితం చేసే రోజుల్లో స్త్రీ జనోద్ధరణకు తన జీవితాన్ని అర్పించిన ధీర వనిత సావిత్రిబాయి పూలే అని ఏఎంసీ వైస్ చైర్మన్ తెంటు పార్వతి అన్నారు. సావిత్రి బాయి పూలే వర్ధంతి సందర్భంగా శుక్రవారం స్థానిక ఇందిరమ్మ కాలనీలో సావిత్రిబాయి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మున్సిపల్ కో ఆప్షన్ మెంబర్ రియాజ్‌ఖాన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అన్వర్ బాషా, రాయగడ జగదీష్, రామమోహన్, తదితరులు పాల్గొన్నారు. అలాగే ఏఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో వివిధ విద్యాసంస్థల్లో సెమినార్‌లు నిర్వహించారు.

మహిళావిద్యకు పెద్దపీట ..

బొబ్బిలి రూరల్: మహిళా విద్యకు పెద్దపీట వేసిన మహనీయురాలు సావిత్రిబాయి పూలే అని అలజంగి సీబీఎం హెచ్‌ఎం కె.కృష్ణదాస్ అన్నారు. సావిత్రి బాయి పూలే వర్ధంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. మహిళా విద్యాభివృద్ధికి ఆమె చేసిన సేవలను ఉపాధ్యాయులు వివరించారు.



బొబ్బిలి రూరల్: అలజంగిలో సావిత్రిబాయి పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న విద్యార్థులు

విద్యార్థుల్లో అభ్యసనా సామర్థ్యాలు పెంపొందించాలి



సోమరాజుపేట పాఠశాలలో నిర్వహిస్తున్న ఎఫ్‌ఏ-4 పరీక్షలను పరిశీలిస్తున్న ఎంఈఓ ప్రసాదరావు



వంగర: విద్యార్థి పరీక్ష పేపర్‌ను పరిశీలిస్తున్న ఎంఈఓ దుర్గారావు

రేగిడి: విద్యార్థుల్లో అభ్యసనా సామర్థ్యాలు పెంపొందించాలని ఎంఈఓ ఎంవీ ప్రసాదరావు కోరారు. శుక్రవారం మండలంలోని సోమరాజుపేట, దేవుదల, ఉంగరాడ గ్రామ పాఠశాలల్లో జరుగుతున్న ఎఫ్‌ఏ-4 పరీక్షలను పరిశీలించిన ఆయన పాఠశాలల్లో ప్రభుత్వం అన్ని మౌలిక సదుపాయాలు కల్పించిందని, విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాల్సిన గురుతర బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు.

వంగర: స్థానిక మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో జరుగుతున్న ఎఫ్‌ఏ-4 పరీక్షలను ఎంఈఓ వై.దుర్గారావు శుక్రవారం పరిశీలించారు. విద్యార్థుల్లో మంచి జ్ఞానం పెంపొందించాలని ఆయన ఉపాధ్యాయులకు సూచించారు. క్రమశిక్షణతో చదివితే మంచి భవిష్యత్ ఉంటుందని విద్యార్థులకు తెలిపారు.

వినతిపత్రం అందజేత



ఎమ్మెల్యే జోగులుకు వినతిపత్రం అందిస్తున్న రాజాం పెన్షనర్ల అసోసియేషన్ సభ్యులు

రాజాం: స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే కంబాల జోగులుకు రాజాం పెన్షనర్ల అసోసియేషన్ సభ్యులు శుక్రవారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు తమ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో అసోషియేషన్ అధ్యక్షుడు ఎస్.గౌరీంకర్, కార్యదర్శి డి.అప్పలనాయుడులు తదితరులు పాల్గొన్నారు.

సామూహిక గృహప్రవేశాలకు సిద్ధం కావాలి



ఇల్లంనాయుడువలసలో ఇళ్ల నిర్మాణ లబ్ధిదారులకు అవగాహన కల్పిస్తున్న ఎంపీడీఓ శంకరరావు

రాజాం: జగనన్న హౌసింగ్ కాలనీల్లో సామూహిక గృహప్రవేశాలకు సిద్ధం కావాలని ఎంపీడీఓ బాసూరి శంకరరావు లబ్ధిదారులకు సూచించారు. హౌసింగ్ డే కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండలంలోని ఇల్లంనాయుడువలస గ్రామంలో లబ్ధిదారుల ఇళ్ల నిర్మాణాలను పరిశీలించిన ఆయన ఉగాది నాటికి నిర్మాణాలు పూర్తి చేయాలని కోరారు. ఆయన వెంట హౌసింగ్ ఏఈ వేణుగోపాలరావు, వెలుగు ఏపీఎం టి.దధికుమార్, ఏపీఓ సాయిరాం ఉన్నారు.

సంతకవిటి: మండలంలోని మిర్తివలస గ్రామంలో హౌసింగ్ డే కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ ఎస్.రఘునాధాచారి జగనన్న కాలనీ ఇళ్ల లబ్ధిదారులతో మాట్లాడి, నిర్మాణాలను వేగవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ ఆర్.భూపతినాయుడు, ఎంపీటీసీ రమణ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా...

ఉపాధి పనుల పరిశీలన

సంతకవిటి: మండలంలోని తాలాడ గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఎంపీడీఓ ఎస్.రఘునాధాచారి శుక్రవారం పరిశీలించారు. రెండు పూటలా పనిచేయాలని, నిర్దేశిత కొలతల్లో నాణ్యతా ప్రమాణాల మేర పనిచేస్తే గిట్టుబాటు అయ్యే వేతనం లభిస్తుందని వేతనదారులకు తెలిపారు. వేసవి దృష్ట్యా పని ప్రదేశంలో తాగునీరు, టెంటు ఉండేలా చూడాలన్నారు. ఆయన వెంట ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఏపీఓ త్రినాధరావు, ఫీల్డ్ అసిస్టెంట్ లక్ష్మణరావు ఉన్నారు.

రుచి, శుచి తప్పనిసరి



కందిశ అంగన్‌వాడీ కేంద్రంలో వండిన వంటకాలు రుచి చూస్తున్న ఐసీడీఎస్ పీఓ సిమ్మాలమ్మ

రేగిడి: అంగన్‌వాడీ కేంద్రాల్లో వండుతున్న వంటకాలు రుచి, శుచి తప్పనిసరిగా కలిగి ఉండాలని ఐసీడీఎస్ పీఓ సిమ్మాలమ్మ సూచించారు. శుక్రవారం మండలంలోని కందిశ, జోడుబందల, సరసనాపల్లి గ్రామ అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించిన ఆమె అక్కడి చిన్నారులకు అందిస్తున్న పౌష్టికాహారం పరిశీలించారు. కేంద్రాలకు వచ్చే గర్భిణులు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, ప్రభుత్వ అందిస్తున్న పౌష్టికాహారం వారికి క్రమం తప్పకుండా అందించాలని తెలిపారు. ఆమె వెంట సూపర్‌వైజర్ అమ్మన్నమ్మ ఉన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం చేయూత



మాట్లాడుతున్న ఏపీఎం చక్రపాణి

వంగర: గ్రామీణ ప్రాంత మహిళల ఆర్థికాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం చేయూతనిస్తోందని ఏపీఎం మీసాల చక్రపాణి తెలిపారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వీఓఏలతో సమావేశమైన ఆయన మహిళలు వ్యాపారం చేసి, అభివృద్ధి చెందేందుకు బ్యాంకు లింకేజీలు, స్త్రీనిధి రుణాలు, సున్నావడ్డీ రుణాలను ప్రభుత్వం అందజేస్తోందన్నారు. మార్చి నెలాఖరు నాటికి స్త్రీనిధి లక్ష్యాలు పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంఎంఎస్ అధ్యక్షురాలు కె.భగవతి తదితరులు పాల్గొన్నారు.

కొండంపేటలో సినిమా ఆడిషన్స్



ఆడిషన్స్‌లో ఎంపికైన ఆర్టిస్టులతో తనయుడు మూవీ టీమ్

రాజాం: స్థానిక పట్టణ పరిధిలోని కొండంపేట గ్రామంలో తనయుడు సినిమాకి సంబంధించి, శుక్రవారం ఆడిషన్స్ నిర్వహించారు. కొత్త ఆర్టిస్టులను సినిమాలోకి తీసుకునేందుకు ఈ ఆడిషన్స్ నిర్వహించినట్లు డైరెక్టర్ యజక కిశోర్, హీరో అలుగోలు సూర్యప్రకాష్ తెలిపారు. కోనా నాగార్జున నిర్మాతగా ఈ మూవీ తెరకెక్కుతోందని, మొత్తం 80 మంది ఈ ఆడిషన్స్‌కు హాజరైనట్లు వారు పేర్కొన్నారు.

ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలి



ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు సూచనలిస్తున్న అధికారులు

రాజాం సిటీ: జగనన్న కాలనీ ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని హౌసింగ్ ఏఈ ఆర్.వేణుగోపాల్, ఎంపీడీఓ బాసూరి శంకరరావు సూచించారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సమావేశమైన వారు మాట్లాడుతూ ఉగాది రోజున సామూహిక గృహ ప్రవేశాలకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తున్న నేపథ్యంలో లబ్ధిదారులతో నిర్మాణాలు పూర్తి చేయించాలన్నారు.

పాఠశాలలకు నులిపురుగు నివారణ మాత్రలు



కొత్తవలస యూపీ స్కూల్ ప్రధానోపాధ్యాయుడికి నులిపురుగు నివారణ మాత్రలు అందిస్తున్న వైద్యాధికారిణి అనూష

రాజాం: పట్టణంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు నులిపురుగు నివారణ మాత్రలు శుక్రవారం అందజేశారు. అర్బన్ పీహెచ్‌సీ వైద్యాధికారిణి అనూష మాట్లాడుతూ ఈ నెల 14వ తేదీన నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా వీటిని పంపిణీ చేశామని, అదేరోజు పాఠశాలల్లోని పిల్లలకు మాత్రలు వేయాలని తెలిపారు.

ఇంటర్ పరీక్ష పత్రాల రాక

బాడంగి: ఇంటర్మీడియట్ పరీక్షలకు సంబంధించిన ప్రశ్నపత్రాలు స్థానిక పోలీస్‌స్టేషన్‌కు శుక్రవారం చేరుకున్నాయి. ఈ నెల 15వ తేదీ నుంచి గురుకులం, ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఇంటర్ పరీక్షలు ప్రారంభంకానున్నాయి. ఇందుకు సంబంధించిన ఒకసెట్ ప్రశ్న పత్రాలు చేరగా.. మిగిలిన సెట్ పేపర్లు త్వరలో వస్తాయని కస్టోడియన్లు తెలిపారు. ప్రశ్నపత్రాలను చీఫ్‌లు టి.రామదాసు, వి.శంకరరావు డిపార్ట్‌మెంటల్ అధికారులతో కలసి పరిశీలించి, భద్రపరిచారు.

పనులు వేగవంతం

తెర్లాం: రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న మనబడి నాడు-నేడు పథకం పనులను వేగవంతం చేయాలని మండల విద్యాశాఖాధికారి జె.త్రినాథరావు అన్నారు. మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో జరుగుతున్న నాడు - నేడు పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. పనులకు సంబంధించి హెచ్‌ఎం పాపారావుకు పలు సూచనలు చేశారు. అనంతరం పాఠశాలలో మరుగుదొడ్లు, మధ్యాహ్న భోజన పథకం, విద్యార్థుల విద్యా ప్రమాణాలను తనిఖీ చేశారు.